RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 03 | డిసెంబర్ 03, 2025 | వెల : రూ.3-00



4లో..

**తనిఖీల్లో రూ.30,59,500 నగదు స్వాధీనం..!**

# పనులు.. పరుగులు

- సర్పంచ్‘గిరి’కి ఆశావహుల ఆరాటం
- వ్యవసాయ పనుల వేళ.. లోకల్ పోల్స్
- ఊపిరిసలపనంతగా ఓ వైపు పనులు.. మరో వైపు ఎలక్షన్స్
- పల్లెల్లో పొలిటికల్ హీట్.. కీలకం కానున్న క్యాంపెయిన్





**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

తెలంగాణలోని పల్లెల్లో పొలిటికల్ హీట్ రోజురోజుకూ బాగా వేడెక్కుతోంది. ఓ వైపు చలి పులి ముదురుతుంటే.. మరో వైపు సర్పంచ్ ‘గిరి’ కోసం ఆశావహుల ప్రచారం, ‘స్థానిక’ ఎన్నికల నేపథ్యంలో రాజకీయం రంజుగా సాగుతోంది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని 545 గ్రామీణ మండలాల్లో 12,760 గ్రామ పంచాయతీలు, 1,13,534 వార్డులకు సంబంధించి ఎలక్షన్స్ జరగనున్నాయి.

**జోరుగా అగ్రికల్చర్ వర్క్స్**

పంచాయతీ ఎన్నికలంటేనే గ్రామాల్లో సందడి నెలకొంటుంది. ఆ మేరకు పల్లెల్లో పొలిటికల్ హీట్ నెలకొంది. కానీ, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పంచాయతీ ఎన్నికలు వ్యవసాయ పనులు జోరుగా ఉన్న సమయం లోనే రావడంతో పోటీ చేసే ఆశావహులు పరుగులు తీస్తున్నారు. ఇటు వ్యవసాయ పనులు, అటు ఎన్నికలతో తలమునకలవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల వారికి 90 శాతం జీవనాధారం వ్యవసాయ పనులపైనే. కూలీ పనులు చేసుకునే వారికి ఈ సమయమే ఎంతో ముఖ్యమైనది. మరోవైపు ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. రబీ సాగు మొదలైంది. దీంతో పత్తి పంటను తీసెసి మొక్కజొన్న పంటలు వేస్తున్నారు. ఇంకోవైపున రైతులు వరినార్లు పోస్తున్నారు. మొత్తంగా సాగు పనులు జోరందుకోగా, పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలవడంతో ఆశావహులు ఆగమాగం అవుతున్నారు. బ్యాంకు అకౌంట్, ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ ఆఫీసులకు పరుగులు తీస్తున్నారు. ఫ్లెక్సీ, బ్యానర్లు, కరపత్రాలు, ఓటరు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. మరో వైపు అగ్రికల్చర్ వర్క్స్‌ను సమన్వయం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, ఎన్నికల కారణంగా సాగు పనులు ఆలస్యమయ్యే అవకాశం లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది. అయితే, వ్యవసాయ పనులు అత్యంత ఎక్కువగా ఉన్న కీలకమైన సమయంలో .. ఎన్నికలు రావడంతో రైతులు, ఆశావహులు పరుగులు తీసే పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంలో క్యాంపెయిన్ అత్యంత కీలకం కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ప్రధాని కార్యాలయం ఇక నుంచి సేవాతీర్థ్

- నూతన భవనానికి కేంద్రం నామకరణం
- రాజ్‌భవన్ పేరు కూడా మార్పు దిశగా
- దేశవ్యాప్తంగా ప్రభుత్వ భవనాల పేర్ల మార్పుపై దృష్టి



**న్యూఢిల్లీ, వేద న్యూస్ :**

దేశపాలనలో కీలక పాత్ర పోషించే ప్రధాన మంత్రి కార్యాలయానికి కేంద్ర ప్రభుత్వం కొత్త పేరు కట్టింది. ఇకపై ప్రధాన మంత్రి కార్యాలయం “సేవాతీర్థ్” పేరుతో కొనసాగనుంది. నూతనంగా నిర్మించిన ఢిల్లీలోని కార్యాలయ భవనానికి ఈ నామకరణం అధికారికంగా అమల్లోకి వచ్చింది. నవంబర్ 25న కేంద్ర హోంశాఖ ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రకటన ప్రకారం ప్రధాన మంత్రి కార్యాలయం పేరును సేవాతీర్థ్‌గా, రాష్ట్రపతి భవనాలుగా ఉన్న రాజ్‌భవన్‌ల పేరును లోక్‌భవన్‌గా మార్చాలని కేంద్రం నిర్ణయించింది. ఈ ప్రక్రియలో భాగంగానే ఇవాళ పీఎంఓకు ‘సేవాతీర్థ్’ అని నూతన పేరును అమలు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా

3లో..

## భూ విజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

- మన్మోహన్ సింగ్ పేరుతో తెలంగాణలో కొత్త విద్యా యుగానికి శ్రీకారం
- ఖమ్మం జిల్లాలో పరిశోధన, అభివృద్ధికి కొత్త అవకాశం
- విద్య, నీటి పారుదల రంగాలకు ప్రాధాన్యతతో రాష్ట్రాభివృద్ధి లక్ష్యం

3లో..



## ఇక హైవేలపై ప్రయాణం మరింత సురక్షితం

- ఎన్‌హెచ్‌ఏఐ - రిలయన్స్ జియో కీలక ఒప్పందం
- మొబైల్‌కు నేరుగా ప్రమాద హెచ్చరికలు
- కొత్త సిస్టమ్ దేశవ్యాప్తంగా అమలు పోవనుంది

**న్యూఢిల్లీ వేద న్యూస్ :**



దేశంలోని జాతీయ రహదారులపై ప్రయాణం ఇక మరింత సురక్షితంగా మారన ంది. హైవేల్లో ప్రమాదాలు తగ్గించేందుకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అత్యాధునిక మొబైల్ ఆధారిత భద్రతా హెచ్చరిక వ్యవస్థను ప్రవేశపెడుతోంది. ఇందుకోసం రిలయన్స్ జియోతో మహత్తర ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద ప్రమాద అవకాశాలు ఉన్న ప్రాంతాలు, కఠిన వాతావరణ పరిస్థితులు, రోడ్లపై పశువుల సంచారం, సడన్ డైవర్షన్స్ వంటి కీలక సమాచారాన్ని నేరుగా ప్రయాణికుల

3లో..

## పార్టీ బలోపేతం కోసం కలిసి పనిచేస్తాం

- వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా అధ్యక్షులను ప్రకటించింది. ఇటీవల ప్రకటించిన అధ్యక్షులకు మంగళవారం గాంధీభవన్లో ఏఐసిసి జాబితా ప్రకారము నూతన జిల్లా అధ్యక్షులకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా నూతన అధ్యక్షునిగా నియమిం పబడిన మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా నూతన అధ్యక్షునిగా అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, విశ్వనాధన్, సచిన్ సావంత్, రాష్ట్ర రథసారథి మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి తూర్పు శాసనసభ్యులు కొండ సురేఖ, శాసన సభ్యులు దొంతి మాధవ రెడ్డి,రేవూరి ప్రకాష్ రెడ్డి, నాగరాజ్, యశస్విని రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, మేయర్ గుండు సుధారాణి లకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. నమ్మకంతో అప్పచెప్పిన బాధ్యతను వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తూ ఏఐసిసి, పిసిసి పిలుపుమేరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం కృషి చేస్తానని అన్నారు. అలాగే పదవి రావడానికి జర్నలిస్టుల సహకారం సైతం ఉందని వారికి ధన్యవాదాలు తెలిపారు.

## ఆదర్శనగర్‌లో 30 ఏళ్ల మురుగు సమస్యపై కమిషనర్ పరిశీలన



- బస్తీ ప్రాంతాల్లో మురుగు నీరు ఇళ్లలోకి చేరుతోందన్న ఫిర్యాదుల పరిశీలన
- హుస్సేన్‌సాగర్ నాలా వరకు పరిష్కారం చేపడతామని హామీ
- వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశం

**హైదరాబాద్, వేద న్యూస్ :**

హిమాయత్‌నగర్, ఆదర్శనగర్ బస్తీ పరిసరాల్లో మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న మురుగు నీటి సమస్యను హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ మంగళవారం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మురుగు నీరు సాఫీగా వెళ్లకపోవడం, ఇళ్లలోకి పోటెత్తడం, బోరు బావుల్లోకి చేరి తాగునీరు కలుషితం కావడం వంటి సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఆయన పరిశీలించారు. ప్రాంతానికి దగ్గరలోనే హుస్సేన్‌సాగర్ నాలా ఉన్నప్పటికీ, వర్షాకాలంలో వరదనీరు కూడా కలిసి స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని గుర్తించారు. ఈ పర్యటనలో హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహలక్ష్మి రామన్‌గౌడ్ ప్రాంత సమస్యను కమిషనర్‌కు వివరించారు. “పై ప్రాంతాల నుంచి వచ్చే మురుగు, వరదనీరు మాపై భారంగా పడుతోంది. ముప్పై ఏళ్లుగా ఇదే పరిస్థితి” అని బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదులను విన్న కమిషనర్, సమస్యను బస్తీ వరకే కాదు, హుస్సేన్‌సాగర్ నాలా వరకు పూర్తి స్థాయిలో పరిష్కరించే పనులు చేపడతామని హామీ ఇవ్వడంతో స్థానికుల్లో ఊరట నెలకొంది. వెంటనే పనులు ప్రారంభించండి మురుగు, వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించి, వెంటనే పనులు ప్రారంభి ంచాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కొన్ని పైపులైన్లు దెబ్బతిన్నాయని, వాటిని మార్చితే ప్రారంభ సమస్యలు పరిష్కారమవుతాయని స్థానిక జలమండలి అధికారులు వివరించారు. వర్షాల సమయంలో వచ్చే నీటి ప్రవాహాన్ని అంచనా వేసి, పెద్ద పరిమాణం గల పైపులతో నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. “నివాసాలు పెరుగుతున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేయాలి. వర్షాకాలం ముగిసింది కాబట్టి ఆలస్యం చేయాల్సిన పనిలేదు” అని కమిషనర్ స్పష్టం చేశారు.

వేద న్యూస్

బుధవారం డిసెంబర్ 03, 2025

# 15రోజులలో అంగన్వాడి సెంటర్ కు విద్యుత్ అందిస్తాము

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్నటువంటి అంగన్వాడి సెంటర్ కు కొన్ని సంవత్సరాల నుండి విద్యుత్ సరఫరా అనేది లేకుండా పోయింది. సంబంధిత సమస్యపై విద్యుత్ శాఖ అధికారులు ఏ డి వంశీకృష్ణ, ఏఈ రాములు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో అంగన్వాడి సెంటర్ ను సందర్శించి కరెంట్ సమస్యపై పూర్తి వివరాలు తెలుసుకొని ఏ వైపు నుంచి పోల్స్ వేసి లైన్ వేస్తే భవిష్యత్తులో మరెటువంటి సమస్య రాకుండా సాఫీగా విద్యుత్ సరఫరా జరుగుతుందని నిర్ధారణ చేసుకున్నారు. 15 రోజుల్లోగా అంగన్వాడి సెంటర్ కు విద్యుత్ సరఫరా చేసి వారి సమస్యను తీర్చుతామని ఈ సందర్భంగా ఏడి వంశీకృష్ణ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 15 రోజుల్లో అంగన్వాడి సెంటర్ కు సంబంధించిన



విద్యుత్ సమస్యను విద్యుత్ శాఖ అధికారులు పరిష్కరిస్తారో లేదో చూడాలంటే కొద్ది రోజుల వరకు వేచి చూడాల్సిందే.

# స్మశాన వాటికను మరో ప్రాంతానికి మార్చాలి



**వేద న్యూస్,కరీంనగర్:**

అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆరెపల్లి వాగులో ఒర్రెలో నిర్మించే వాగునా పార్టీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కోమటి రెడ్డి తేజ్ దీప్ రెడ్డి, బండారి శేఖర్ బృందం సందర్శన చేయడం జరిగింది. స్మశానవటిక నిర్మాణం చేస్తున్న ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలిన చేయడం జరిగింది. అనంతరం కోమటి రెడ్డి తేజ్ దీప్ రెడ్డి, బండారి శేఖర్ లు మాట్లాడుతూ ఆరెపల్లి ప్రజలకు ఉపయోగపడేలా స్మశానవటికను నిర్మించాలని అన్నారు. ఆరెపల్లి (ఒర్రెలో) వాగులో నిర్మించడం వలన కాంట్రాక్టర్ ను బతికించడం తప్ప ఎవ్వరికి ఉపయోగం ఉండదని అన్నారు. నగరపాలక సంస్థ ఇంగినిర్ లు ,కాంట్రాక్టర్ కుమ్మకాయి వాగులో నిర్మిస్తున్నారని ఆరోపించారు. స్మశానవటిక నిర్మాణానికి నగరపాలక సంస్థ నుండి రూ. 49.50 లక్షలు నిధులు కేటాయించినరాని అన్నారు. ఒక్క వర్షం గట్టిగా పడితే కొత్తపల్లి చెరువు నుండి వాగు ఒర్రె ద్వారా వచ్చే నీటి ప్రవాహానికి పెద్ద ఎత్తున వాగు ఉప్పొంగి వాగులో నిర్మించిన స్మశానవాటిక కొట్టుకుపోతుందని అన్నారు. స్మశానవాటిక కోసం నిర్మించిన ప్రజాధనం 59. 50లక్షలు వృధా అవుతాయి. ప్రజాధనం పూర్తిగా నీటిలో పోసిన పన్నీరు లాగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరెపల్లి గ్రామంలో మరొక ప్రాంతంలో స్మశాన వాటి నిర్మాణానికి ప్రభుత్వ స్థలం ఉన్నది. ఆ ప్రభుత్వ స్థలానికి వెళ్ళుటకు అవసరమైతే రైతులు 30 ఫీట్ల రోడ్డు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కావున ఆరెపల్లి స్మశాన వాటికను వాగులో కాకుండా మరో ప్రాంతానికి నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే మా పార్టీ ఆధ్వరంలో నగరపాలక సంస్థ ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# విద్యావ్యవస్థ మీద ఎందుకు దృష్టి పెట్టడం లేదు

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయి కుమార్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు డిటెన్షన్ పద్ధతిని ఎత్తివేయాలని, అడ్వాన్స్ సప్లిమెంటరీ నిర్వహించాలని, సరైన టైంలో రిజల్ట్స్ ఇవ్వాలని ,ఫార్మసీ విద్యార్థులకు డిటెన్షన్ పద్ధతి ఎత్తివేయాలని వేలాది మంది విద్యార్థులతో గత కొన్ని సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న పట్టించుకోకుండా ఎటువంటి సర్కులర్లు జీవోలు తీయకుండా కాలయాపన చేసిన కాకతీయ యూనివర్సిటీ అధికారులు అత్యవసరంగా సర్కులర్లు తీస్తూ విద్యార్థులకు ఉపయోగపడని అంశాలపై అర్ధరాత్రి జీవోలు సృష్టిస్తున్న యూనివర్సిటీ అధికారులు. ప్రశ్నిస్తున్న విద్యార్థులపై ఉక్కు పాదం మోపుతున్న యూనివర్సిటీ అధికారులు అదేవిధంగా కేయూలోని అన్ని డిపార్ట్మెంట్లో సరిపడా ప్రొఫెసర్లు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్న కూడా పట్టించుకోని అధికారులు, కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీలో మహిళ మూత్రశాలలో నీళ్లు లేక తీవ్రమైన ఇబ్బందులకు గురైనా ఏ రోజు కూడా స్పందించని అధికారులు ఉపయోగపడని అంశాలపై త్వరగా స్పందిస్తూ అర్ధరాత్రిలో జీవోలు తీస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేసే ప్రక్రియ యూనివర్సిటీలో జరుగుతుంది. కాబట్టి తక్షణమే సమస్యలకు




పరిష్కారం చూపాలని కోరుతున్నామన్నారు. నిన్న కాకతీయ యూనివర్సిటీ కామన్ మెస్ లో కుళ్ళిపోయిన, పుచ్చిపోయిన కూరగాయలు వచ్చాయని విద్యార్థులు ఆందోళనకు గురికావడం కూడా జరిగిందని, ఇప్పటివరకు ఆ అంశంపై స్పందించకుండా విద్యార్థులపై ఉక్కు పాదం మోపుతూ ఆ విద్యార్థుల డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి లతో చెప్పి తీవ్రమైన ఇబ్బందులకు గురి చేసే ప్రక్రియ జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ స్వేరో స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులు మోజెస్, చెట్టుపల్లి శివకుమార్, విష్ణు, ఆనంద్, భాస్కర్, సతీష్, సుఖేష్, అవినాష్ , శ్రావణ్, అజయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ పై శిక్షణ



**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ పై తహసీల్దార్లు, ఎంపీఓలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ట్రైనర్లు పీ పీ టీ ద్వారా మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉంటుందని తెలిపారు. వారికి సంబంధిత అప్లికేషన్లు ఎంపీడీఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని, వాటిని ఎస్ఈసీ నిబంధనల ప్రకారం నింపి అందజేయాలని సూచించారు. శిక్షణలో శిక్షణ నోడల్ అధికారి శేషాద్రి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి లక్ష్మీరాజం, ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఓ కేంద్రాలు తనిఖీ




**వేద న్యూస్,ఇల్లంతకుంట,**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పలు ఆర్ఓ కేంద్రాలను జిల్లా సాధారణ పరిశీలకులు రవి కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఇల్లంతకుంట మండలంలోని పొత్తూరు, పెద్దలింగాపూర్ గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను జిల్లా సాధారణ పరిశీలకులు పరిశీలించారు. ఆయా ఆర్ ఓ కేంద్రాల్లో నామినేషన్లు, హెల్ప్ డెస్క్ ఇతర ఏర్పాట్లను పరిశీలించి, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట ఎంపీడీఓ శశికళ సిబ్బంది ఉన్నారు.

# సర్పంచ్ అభ్యర్థిగా మంజుల సుధాకర్, నామినేషన్

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కత్తెరపాక మంజుల సుధాకర్, నామినేషన్ వేయడం జరిగింది. అనంత రం కత్తెరపాక మంజుల సుధాకర్, మాట్లాడుతూ కోదురుపాక గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి మహిళా యువశక్తిగా, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా, సర్పంచ్ అభ్యర్థిగా నేను మీ ముందుకు వచ్చాను. నాకు ఒక అవకాశం ఇచ్చి నన్ను అధిక మెజారిటీతో గెలిపించాలని కోదురుపాక గ్రామ ప్రజలను కోరారు. అలా గే వార్డు మెంబెర్స్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ ప్రజలు, యువకు లు, తదితరులు, పాల్గొన్నారు.



# టాలీప్రైమ్ పై ఒక్కరోజు వర్క్‌షాప్




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో టాలీప్రైమ్ కాన్సెప్ట్‌లు, ఫీచర్లు, ప్రాక్టికల్ వినియోగం అనే అంశంపై మంగళవారం నాడు ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 180 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సెషన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ సెమినార్ హాల్‌లో జరిగింది. టాలీప్రైమ్ అనేది ప్రపంచవ్యాప్తంగా 8 మిలియన్లకు పైగా వినియోగదారులను కలిగి ఉన్న ప్రముఖ బిజినెస్ సాఫ్ట్‌వేర్,భారతదేశంలో అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ విభాగంలో దాదాపు 80 శాతం మార్కెట్ షేర్‌ను కలిగి ఉంది. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు టాలీప్రైమ్ సాఫ్ట్‌వేర్ యొక్క ముఖ్యమైన అంశాలు, వినియోగ విధానాలు, ప్రాక్టికల్ అప్లికేషన్ గురించి లోతుగా అవగాహన పొందారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి తోడ్పడేలా ఈ కార్యక్రమం రూపొందించ బడింది. ఈ కార్యక్రమంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అమర వేణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, డీన్ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ ప్రొఫెసర్ వరలక్ష్మి, యూపీజీసీ సుబేదారి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరసింహ చారి, డాక్టర్ ఫణీంద్ర కుమార్, డాక్టర్ ప్రగతి రెడ్డి పాల్గొన్నారు.

# మహాధర్నాను విజయవంతం చేయండి

– మారుపాక అనిల్ కుమార్



**వేద న్యూస్,ఇల్లంతకుంట:**

జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెం బర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా ధర్నా కరపత్రాలను రాష్ట్ర అధ్యక్షుడు వీరాహత్ అలీ,జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ ల పిలుపు మేరకు టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు మారుపాక అనిల్ కుమార్ మండల ప్రెస్ క్లబ్ సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులకు కొత్తగా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలని,ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధరించాలని,అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని,వృత్తి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.డిసెంబర్ 3న హైదరాబాద్ మసాబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద ఉదయం10 గంటలకు జరగనున్న మహా ధర్నాకు రాష్ట్ర, జాతీయ, జిల్లా, మండల నాయకులు తోడ్పడాలని, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తూముకుంట శ్రీనివాస్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు రాకం సుమన్, ఏనుగుల మహేందర్, కొయ్యడ రాజయ్య, కముటం పర్శరాం, కందారం ఆంజనేయులు, గుండ రవిందర్, బండారి శ్రీని వాస్, కాసుపాక శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో దివ్యాంగుల క్రీడలు ప్రారంభం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకతీయ విశ్వవిద్యాలయంలో వికలాంగుల సెల్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయానికి చెందిన దివ్యాంగ విద్యార్థులు, ఉద్యోగులు, నాన్ టీచింగ్ సిబ్బంది కోసం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కట్ల రాజేందర్, కేయూ స్పోర్ట్స్ స్పోర్ట్స్ సెక్రటరీ ఆచార్య వై.వెంకయ్య, కేయూఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారా యణ,కేయూ వికలాంగుల సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ. రాజు లు కలిసి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు దివ్యాంగ విద్యార్థులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ గ్రామశాఖ నూతన కమిటీ ఎన్నిక

**వేద న్యూస్,శాయంపేట:**



శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం గ్రామ బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన గ్రామ శాఖ నూతన అధ్యక్షుడు ఆలేటి శ్రీనివాస్ వారితో పాటు మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీపీ తిరుపతి రెడ్డి, సదా శివ రెడ్డి, ఆలేటి రాకేష్, కొత్తగట్టు సాయి, పెంబర్తి వినయ్, అఖిల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన సీఐ శశిధర్ రెడ్డి

**వేద న్యూస్, కాసిపేట:**



కాసిపేట మండలంలో సాగుతున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రి యను మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి మంగళవారం ప్రత్యేక పర్యటన నిర్వహిం చారు. కాసిపేట ఎస్సై ఆం జనేయులు, దేవాపూర్ ఎస్సై గంగారంలతో కలిసి నామినేషన్ కేంద్రాలను సందర్శించిన సందర్భంగా ఏర్పాట్లు, భద్రతా పర్యవేక్షణ, క్యూలైన్స్, అభ్యర్థుల నామినేషన్ దాఖలు ప్రక్రియను సమీక్షించారు. నామినేషన్ కేంద్రాల్లో ఎలాంటి అంతరాయం లేకుండా, శాంతియుత వాతావరణంలో ప్రక్రియ కొనసా గుతున్నట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో ప్రజలు, అభ్యర్థులు నియమాలు పాటించాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని సిఐ సూచించారు. కాసిపేట మండలంలో నామినేషన్ దాఖలు ప్రక్రియ ప్రశాంతంగా సాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ప్రధాని కార్యాలయం ఇక నుంచి సేవాతీర్థ్

భవనాల పాత నామకరణం నుంచి ప్రజలకు మరింత చేరువయ్యే పేర్లను ఇవ్వాలనే కేంద్ర విధానంలో మరో అడుగు ముందుపడింది. అందులో భాగంగా ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు తమ రాష్ట్ర రాజ్‌భవన్‌లను 'లోక్‌భవన్'గా మార్చాయి. ఈ జాబితాలో త్వరలో తెలంగాణ కూడా చేరనుంది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌కు 'లోక్‌భవన్'గా పేరు పెట్టే ప్రక్రియ పూర్తయినట్లు అధికార వ్యవహారాల దృష్ట్యా సమాచారం అందుతోంది. కేంద్రం తీసుకున్న ఈ చర్య దేశ రాజకీయ వాతావరణంలో విస్తృత చర్చకు దారితీస్తోంది. పేర్ల మార్పు ద్వారా ప్రజలకు మరింత సమీపతను చాటుకునే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ప్రజాసేవ మార్గంలో ప్రభుత్వ భవనాల పాత్రను ప్రతిబింబించేలా సేవాతీర్థ్, లోక్‌భవన్ వంటి పేర్లు నిర్ణయించడమే ప్రధాన ఉద్దేశ్యమని కేంద్ర వర్గాలు పేర్కొంటున్నాయి.

## భూ విజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయాన్ని
# ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం, వేద న్యూస్ :**




దేశంలోనే మొదటి భూ విజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెం లో ఏర్పాటు చేసిన ఈ విశ్వ విద్యాలయానికి మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును పెట్టినట్టు ఆయన తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఈ విద్యాసంస్థను ప్రాముఖ్యంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకటి శ్రీహరి తో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సంస్థ స్థాపన ప్రాంతానికి విద్య, పరిశోధన, ఉపాధి పరంగా ఉపయోగపడనుందనే అభిప్రాయం వ్యక్తమైంది. తెలంగాణ ఆత్మకాంక్ష – చారిత్రక నేపథ్యం గుర్తుచేసిన సీఎం ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి, ఆరు దశాబ్దాల క్రితం తెలంగాణ స్వరాష్ట్ర భావన పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాల్లోనే పుట్టిందని చెప్పారు. ఆ ఆకాంక్షను నెరవేర్చడంలో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అందుకే ఈ విశ్వవిద్యాలయానికి వారి పేరు పెట్టినట్టు వివరించారు. దేశాన్ని సంక్షోభం నుంచి సంక్షేమ దిశగా నడిపించిన నేతగా మన్మోహన్ సింగ్ పేరు నిలుస్తుందని, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ఆయన స్ఫూర్తి అని ముఖ్యమంత్రి ప్రశంసించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చూపిన మార్గదర్శక తత్వంతో విద్య, నీటి పారుదల రంగాలను బలోపేతం చేస్తున్నట్టు చెప్పారు. ఖనిజ సంపద – పరిశోధనకు కేంద్రం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అపారమైన ఖనిజ సంపద ఉన్నట్టు ముఖ్యమంత్రి గుర్తుచేశారు. సింగరేణి వంటి పెద్ద సంస్థలు ఉన్న ప్రాంతంలో ఖనిజ సంపదపై అధ్యయనం, పరిశోధన, అన్వేషణ చేయడానికి అవసరమైన వేదికగా ఈ విశ్వవిద్యాలయం పనిచేస్తుందని చెప్పారు. బహిష్కృత ప్రాజెక్టులకు నూతన ఊపిరి ఈ ప్రాంతంలో చాలా సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఈ జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించే బాధ్యత ప్రభుత్వమిదేనని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి విద్య, పారుదలే ఆధారం తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టాలన్న దృఢ సంకల్పంతో విద్య, నీటి పారుదల రంగాలకు ప్రాముఖ్యతనిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. శాస్త్ర సాంకేతికత, పరిశోధన, పరిశ్రమల సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఈ విశ్వవిద్యాలయం భూ విజ్ఞాన శాస్త్రం రంగంలో దేశానికి మార్గనిర్దేశక కేంద్రంగా మారాలని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# ఇక హైవేలపై ప్రయాణం మరింత సురక్షితం

మొబైల్‌కు పంపనున్నారు. ఈ సరికొత్త సిస్టమ్ కోసం అదనపు హెచ్చరిక బోర్డులు అవసరం లేకుండా, పూర్తిగా జియో 4జీ, 5జీ నెట్‌వర్క్‌పై ఆధారపడుతుందని అధికారులు తెలిపారు. ప్రయాణికులకు ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ అలర్ట్స్, హై ప్రైయారిటీ కాల్స్ రూపంలో ముందస్తు హెచ్చరికలు చేరడం వల్ల డ్రైవర్లు ముందుగానే జాగ్రత్తలు తీసుకునే వీలుంటుంది. ప్రాజెక్ట్ తొలి దశగా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ కార్యాలయాల్లో పైలట్ మోడ్‌లో అమలవనుంది. ట్రయల్స్ తరువాత ఈ సిస్టమ్‌ను జాతీయ రహదారి నెట్‌వర్క్ మొత్తం మీద విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ వ్యవస్థను హైవేయాత్ర యాప్, ఎన్‌హెచ్ఏఐ డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్, నేషనల్ హైవే ఎమర్జెన్సీ నంబర్ 1033తో అనుసంధానం చేయనున్నారు. డేటా రక్షణ ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ సురక్షితమైన హెచ్చరికలు అందేలా చర్యలు తీసుకుంటామని హైవేస్ అథారిటీ స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఇతర టెలికాం సంస్థలను కూడా ఈ వ్యవస్థలో చేర్చి దేశవ్యాప్తంగా అన్ని హైవేలు రియల్ టైమ్ సేఫ్టీ అలర్ట్ ఫెసిలిటీతో పనిచేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ ఒప్పందం రహదారులపై జర్నీ సేఫ్టీని పెంపొందించే దిశగా ప్రధాన ముందడుగు అంటూ అధికారులు భావిస్తున్నారు.

## పవన్ కల్యాణ్ 'దిష్టి' వ్యాఖ్యలపై
# పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శ

**హైదరాబాద్, వేద న్యూస్:**



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన "దిష్టి" వ్యాఖ్యలపై తెలంగాణ ఐటీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా మండిపడ్డారు. కీలక పదవిలో ఉన్న నాయకుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రెండు రాష్ట్రాల మధ్య సౌహార్ద వాతావరణాన్ని దెబ్బతీసే చర్య అని విమర్శించారు. మంగళవారం హుస్నాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. కొనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి "తెలంగాణ ప్రజల దిష్టి" కారణమని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, పొన్నం ప్రభాకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "మీ సముద్రం నుంచి వచ్చే తుపాను మా రాష్ట్రాన్ని ముంచేస్తోంది. అయితే డిప్యూటీ సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి అపార్థపూరిత వ్యాఖ్యలు చేయడమేంటి?" అని ప్రశ్నించారు. "కోనసీమపై మేమెందుకు దిష్టి పెడతాం?" అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అన్నదమ్ముల్లాంటివని, రెండు వర్గాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు చెడగొట్టే ప్రయత్నాలు ఎవరు చేసినా సహించబోమని పొన్నం హెచ్చరించారు. ప్రజలను ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు ప్రాంతీయ ద్వేషానికి దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీతో పొత్తులో ఉన్న ప్రభుత్వ ప్రతినిధి ఇలా మాట్లాడటం బాధాకరమని, రాజకీయ ప్రయోజనాల కోసం ఈరకం విమర్శలు చేయడం అనైతికమని వ్యాఖ్యానించారు.పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీజేపీ నాయకత్వం వెంటనే స్పందించాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. "ఇలాంటి వ్యాఖ్యలను సమర్థించి మౌనంగా ఉండటం కూడా బాధ్యతారాహిత్యం. వెంటనే స్పందించి వివరణ ఇవ్వాలి" అని అన్నారు.

# ప్రణాళిక ప్రకారం చదివి..ఉన్నత స్థానాలకు ఎదగాలి

**– ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**– బోయినిపల్లి మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ**

**వేద న్యూస్,బోయినిపల్లి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రం లోని మోడల్ స్కూల్ లో ఆకస్మిక తనిఖీ చేసి ప్రతి విద్యార్థి, ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, పిలుపు ఇచ్చారు. బోయినిపల్లి మోడల్ స్కూల్ లో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు,సిబ్బంది హాజరు, విద్యాలయం ఆవరణ, మధ్యాహ్న భోజనం మెనూ, తయారీని పరిశీలించారు. మెనూ ప్రకారం ఈ రోజు ఏ ఆహార పదార్థాలను సిద్ధం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. 7 వ తరగతి గదిలో ఇంగ్లీష్ పాఠం కొనసాగుతుండగా, పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, మాట్లాడుతూ.. ప్రతి రోజూ స్కూల్ కు రావాలని విద్యార్థులకు సూచించారు. సిలబస్ ఫిబ్రవరిలో పూర్తి చేయాలని, వార్షిక పరీక్షలకు సాధన చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులం దరూ అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని, ఇంగ్లీష్ లో అనర్గళంగా మాటాడేలా సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు.

# మహిళ సాధికారికను పెంపొందించుకోవాలి

**– జిల్లా సంక్షేమ అధికారి జయంతి**



**వేద న్యూస్, శాయంపేట:**

మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా ప్రాతినిధ్య వహించాలని మహిళా సాధికారితను పెంపొందించుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి అన్నారు. శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం పి. యు మేనేజర్ గుడిమల మానస చౌదరి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు .ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి జయంతి పాల్గొని మాట్లాడుతూ మహిళలు వ్యవసాయ రంగంలో కుటుంబ పోషణలో మహిళా పాత్ర గననీయమైనదని వారు కొనియాడారు. మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా అన్ని రంగాలలో ప్రాతినిధ్యం వహించాలని అన్నారు.అంతేకాకుండా మహిళలు ప్రతి కుటుంబ సంరక్షణ విషయంలో తోడ్పాటు అందిస్తూ జీవన మనుగడకు ఎంతో పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని ప్రతి ఒక్కరు కూడా ఆ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# 25 ఏళ్ల తర్వాత ఏకగ్రీవ ఎన్నికలు

**– ధర్మారావుపేట గ్రామంలో సర్పంచ్, రెండు వార్డులు ఏకగ్రీవం**

**వేద న్యూస్, కాసిపేట:**



మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి నియోజకవర్గానికి చెందిన కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామంలో 25 సంవత్సరాల తర్వాత సర్పంచ్ పదవి సహా రెండు వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి.స్థానికంగా శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్వగ్రామమైన ధర్మారావుపేటలో, ప్రేమ్ సాగర్ రావు వర్గం అభ్యర్థులు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే వేయడంతో పోటీ లేకుండానే ఎన్నికలు ముగిశాయి. సర్పంచ్‌గా జుగ్నక రాధ మనోజ్ ఏకగ్రీవంగా ఎంపిక కాగా, వార్డు సభ్యులుగా పార్వతి పద్మపెద్దిరాజు ఆజ్మీర శ్రీవల్లి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ ఏకగ్రీవ ఎన్నికలు సాధించడానికి కృషి చేసినందుకు ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మిక సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్ రావు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు గెలిచిన అభ్యర్థులు వెల్లడించారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొని ఉండటంతో ప్రజలు ఏకగ్రీవ ఎన్నికలను స్వాగతించారు.

# మహిళలు జీవనోపాదులను మెరుగుపరుచుకోవాలి

**– ఏంఐఎస్ ఆఫీసర్ అక్కల రమేష్**



**వేద న్యూస్, శాయంపేట:**

మహిళలు వ్యవసాయం రంగంతోపాటు అదనపు ఆదాయం సమకూర్చే వివిధ సంస్థల సహకారంతో మహిళలను ముందంజలో ఉండాలని అక్కల రమేష్ అన్నారు. అనునిత్యం వారి యొక్క శ్రేయస్ కోసము ప్రజ్వల్ సంస్థ వారు తోడ్పాటు అందిస్తుంది అన్నారు.వారి జీవన విధానంలో జీవనోపాదులు మెరుగుపరుచుకునే కార్యక్రమాలను అభివృద్ధి చెందే విధంగా అవగాహన కార్యక్రమాలు ప్రభుత్వ అందించేటువంటి సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకునే విధంగా ఉండాలని వారు వివరించారు.లేబర్ కార్డు, ప్రధానమంత్రి సంరక్షణ, ప్రధానమంత్రి జీవనజ్యోతి, మహిళ సంఘాలలో వివిధ రంగాల ఆర్థిక రుణాలు సదుపాయాలను సద్వినియోగం చేసుకొని కుటుంబంలో పోషణకు ముఖ్యపాత్ర వహించాలని వారు అన్నారు. అంతేకాకుండా ప్రజ్వల్ రైతు సంఘం నిర్వహిస్తున్నటువంటి బీసీఐ ప్రాజెక్టు కార్యక్రమాలు ఒక రంగోలి ద్వారా వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం పాలకవర్గ సభ్యురాలు ఎడ్ల రజిత ,ప్రజ్వల్ క్షేత్ర సిబ్బంది ఎస్కే గౌస్, పోరండ్ల భానుమతి, కుక్కల కల్పన, పోతు సునీల్, రవిచందర్, అనీఫా, అమరేందర్ రెడ్డి, రాంబాబు, వంశీ, చిట్టి, తిరుపతి,ప్రశాంత్, మహిళా సాధికారిత సంబంధించిన వివిధ రంగాల సంస్థ ప్రతినిధులు అనూష, విజయ్, రమేష్, మానస, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

**– స్వతంత్ర అభ్యర్థి నాగార్జునపు రామాచారిలి**

**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



లక్ష్మీదేవిగూడెం గ్రామాన్ని ప్రజలందరూ నన్ను ఆశీర్వదించి గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థిపు రామాచారి కోరారు. మంగళవారం ఉదయం ఆమనగల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ కేంద్రంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీలు, వీధి లైట్లు, విద్య వైద్యం పై ప్రత్యేక దృష్టి పెడతానని పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారిస్తానన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆదుకుంటానని చెప్పారు. ఏ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందకపోయినా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. నన్ను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## మల్దకల్ ను సందర్శించిన
# హంపి పీఠాధిపతి

**వేద న్యూస్, గద్వాల్ :**



ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని కర్ణాటకలోని హంపి పీఠాధిపతులు విరూపాక్షి విద్యారణ్య భారతిస్వామి మంగళవారం సందర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవగా ప్రతి ఒక్కరూ భావించాలని ఆ భగవంతుడు ఏ రూపంలో ఉన్న భక్తు లను అనుగ్రహిస్తారని తెలిపారు. ఇందుకు తగిన రెండు దృష్టాంతాలను స్వామివారు భక్తులకు వివరించారు. అనంతరం స్వామీజీని ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు ఈవో సత్య చంద్రారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భక్తులను స్వామీజీ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పట్వారి అరవిందరావు, చంద్రశేఖర రావు, బాబురావు, మధుసూదన్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు నాగరాజు ,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం డిసెంబర్ 03, 2025

# ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలి




**వేద న్యూస్, టేక్మాల్:**

గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఓటరు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలైన శాబాద్ తాండ, సిఎం తాండ, ఎలుపేట్, ఎల్లు గొండ, కమ్మరి కత, సూరంపల్లి, గ్రామాలకు చెందిన ప్రజలకు మరియు కొత్తపల్లి, అల్లపూర్,అన్నారం గ్రామాలకు చెందిన ప్రజలకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి విభేదాలు, వర్గపోరు సృష్టించకుండా కలిసిమెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు వస్తూ పోతూ ఉంటాయని, గ్రామంలో ప్రతిరోజూ ఒకరినొకరు చూసుకుంటూ జీవించాల్సి ఉంటుందని, అందువల్ల ప్రజలు ఐక్యతను పాటించాలని సూచించారు. ఓటు హక్కును ప్రశాంతంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాల ని సూచించారు. గత

**- ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు**

ఎన్నికల్లో గొడవలకు కారణమైన వారిని ఇప్పటికే బైండోవర్ చేయడం జరిగిందని, వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరిగి ఇలాంటి ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో బెల్ట్ షాప్లను ఇప్పటికె మూసి వేయించామని, ఏవరైనా దొంగ చాటుగా అమ్ముతునట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో నగదు, మద్యం, ఇతర ఉచిత పంపిణీలపై కట్టుదిట్టమైన నిఘా పెట్టినట్లు ఎస్పీ గారు తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఎవరూ ఓటర్లను ప్రలోభపెట్టి మద్యం, నగదు లేదా ఉచితాలు పంపిణీ చేయరాదని స్పష్టం చేశారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించి, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ప్రజలను కోరారు. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని, అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉందని ఎస్పీ హెచ్చరించారు. యువత అనవసర గొడవలకు వెళ్లి కేసుల్లో ఇరుక్కోకూడ ్దని, ఒక కేసు నమోదైనా భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు రావని సూచించారు. ఓటు వేసేటప్పుడు ప్రతి ఓటరు క్యూ లైన్‌ను కచ్చితంగా పాటించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, అల్లాదుర్గ్ సీఐ రేణుక రెడ్డి, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, మెదక్ రూరల్ సీఐ జర్జ్, పాపన్నపేట ఎసై శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

# పాలేరులో కాంగ్రెస్ జోరు

**వేద న్యూస్, కూసుమంచి :**

గ్రామ పంచాయతీ ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో పాలేరు నియోజకవర్గ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీలోకి ఖమ్మం రూరల్, కూసుమంచి మండలాల నుంచి ఇరవై కుటుంబాలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో మంగళవారం చేరాయి.

**తీర్థాల నుంచి 10 కుటుంబాల చేరిక**

ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామానికి చెందిన పది కుటుంబాలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నాయి. బోడా వెంకన్న ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. చేరిన వారిలో భూక్యా బాస్ నాయక్, భూక్యా మోతిలాల్, సీతల అనంతరాములు, సీతల వీరన్న, సీతల నాగరాజు, సీతల శంకర్, భూక్యా బాస్, తేజావత్ శివ, తేజావత్ సురేష్ తదితరులు ఉన్నారు. వీరికి ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

**మంగళిబండ తండా నుంచి ఉప సర్పంచ్ సహా**

అదేవిధంగా కూసుమంచి మండలం మంగళితండా నుంచి కూడా



బీఆర్ఎస్‌కు చెందిన ఉప సర్పంచ్ తేజావత్ బాలకృష్ణ సహా మరో పది కుటుంబాలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొన్నారు. తేజావత్ సుబాస్, తేజావత్ నరేష్, బానోత్ శ్రీను, తేజావత్ శోభన్, తేజావత్ కృష్ణ, తేజావత్ గోపి, బానోతు సింహాద్రి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి కూడా క్యాంపు కార్యాలయంలో తుంబూరు దయాకర్ రెడ్డి వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తేజావత్ వెంకట్, తేజావత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి




**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి, విలాసాగర్, జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు మండల ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎస్సై రమాకాంత్, పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ప్రజలకు పలు సూచనలు జారీ చేసారు. స్వేచ్ఛా, నిష్పక్షపాత, ఎన్నికలు జరగాలంటే ప్రతి ఓటరు బాధ్యతతో వ్యవ హరించాలని తెలిపారు.

**- ఎస్సై రమాకాంత్**

ఎన్నికల సమయంలో చట్టం,శాంతి, పరిరక్షణ కు ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని ఎస్సై, పేర్కొన్నారు. రాజకీయ కా రణాలతో వివాదాలు, గుంపుల ఘర్షణలు సృష్టించే ప్రయత్నాలు చేయరా దని హెచ్చరించారు. సామరస్యాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అక్రమ ప్రయోజనాల కోసం డబ్బు, మద్యం, బహుమతులు, స్వీక ్రించడం నేరమని, ఇలాంటి చర్యల్లో పాల్గొనే వారిపై కఠినంగా వ్యవ హరి స్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా తప్పు డు ప్రచారం, పుకార్లు, వ్యాప్తి చేయడం కూడా శాంతి భద్రతలకు ప్రమా దక ్రమని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటిం చాలని అనుమానాస్పద కదలికలు, బెదిరింపులు, అక్రమ రవాణా, లేదా బహుమతుల, పంపిణీ కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందిం చాలని కోరారు. గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా, న్యాయంగా జరిగేందు కు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై రమాకాంత్, పేర్కొ న్నారు.

# సర్పంచ్ ని గెలుపిద్దాం!

ఓటు అంటే...
బూటకపు మాటకాదు
డబ్బు ఉన్నోడి వాటా కాదు
రాజ్యాంగం మనకిచ్చిన
ప్రజాస్వామ్య హక్కు
ఓటోక ఆయుధం
గెలుపుకైనా ఓటమికైనా వారధి –
నమ్మించి ముంచేటోనికి లొంగకు
అరచేతిలో సుక్కల్ని సూపిస్తనంటడు –
ఆకాసమెత్తు అభివృద్ధిచేస్త అంటడు
ఒక పూట బతుకుల్లో చిల్లర జల్లి
అయిదేల్లు అంగడిపాలు జేస్తడు
ఆ పూట.. ఖరీదైన మాటలుజెప్పి
వన్నెలెన్నోజూపి వలవేస్తుంటడు
తెల్లారితే ముదురే పొగరబోతులు
ఎవడైతెనేం మన మంచి కోరనోడు
అభివృద్ధి ఆటంకం గావించెటోడొద్దు
ఆలోచించి అభివృద్ధినే ఎన్నుకో!
ఖాళైన కడుపు నింపుకునే
కుళ్లు రాజకీయాన్ని పసిగట్టు –
వాన్నివీన్ని నమ్మి ఆగమాగం గాక
ఆహోర్నిశలు కృషిజేసెటోన్ని
అందరిలో మంచోన్ని ముందుంచు
అభివృద్ధి గావించేటోన్నే ఎంచుకో!
అలవోకగ నమ్మి మోసపోకుమా
అయిదేల్లు బానిసగాక బ్రతుకు.

**– కోవూరి నర్సింల**
**గురుకుల టీచర్, సంగారెడ్డి జిల్లా.**

# రక్తదానం చేసిన కాగితాల మధు

**వేద న్యూస్, వనపర్తి :**




సాటి మహిళకి సమయా నికి రక్తదానం చేశామని యువశక్తి ఫౌం డేషన్ వ్యవ స్థాపక అధ్యక్షులు కాగితాల మధు తెలిపారు. వివరా ల్లో కి వెళితే పాల మూరు జిల్లా కేంద్రానికి చెందిన హేమలత ఆపరే షన్ కోసం నేహా షాయిన్ హాస్పటల్ లో అడ్మిట్ అవ్వడం జరిగింది.డాక్టర్స్ నిర్ధారణ చేసి వెంటనే ఆమెకు బి పాజిటివ్ బ్లడ్ ఎక్కించాలి అని నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు బ్లడ్ కోసం యువశక్తి ఫౌండేషన్ ని ఆశ్రయి ంచడంతో వెంటనే స్పందించిన యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు రక్తదా నం చేశారు. కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ సేవల కుకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఆరోగ్యవంతమైన యువతీ యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాల ని తెలిపారు. ఈ కార్యక్రమం లో యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షులు కాగితాల మధు, శివ, ఆంజనే యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# భార్యను చంపి భర్త ఆత్మహత్య..!?

**వేద న్యూస్, టేక్మాల్:**

భార్యను చంపి, భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బర్దిపూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బర్దిపూర్ గ్రామానికి చెందిన గంగారం శ్రీశైలం(37), మంజుల (34) దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. మంగళ వారం ఉదయానికి మంజుల హత్యకు గురికాగా, శ్రీశైలం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. దీంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. టేక్మాల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని, పరిశీలిస్తున్నారు. వీరి మరణాలకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కుల బహిష్కరణపై గ్రామస్తులకు ఎస్సై కౌన్సిలింగ్

**వేద న్యూస్,శాయంపేట:**



కులం కట్టుబాట్లు పాటించకుంటే కులం నుంచి బహిష్కరిస్తామన్న కులస్తులకు, గ్రామస్తులకు మంగళవారం శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్సై జక్కుల పరమేష్ మాట్లాడుతూ కాలం మారుతున్నందున ఇలాంటి పోకడలు ఉండవద్దని, కాలానికి అనుగుణంగా వ్యవహరించాలని, ఎదుటివారి హక్కులు హరించవద్దని, ఇలాంటి చర్యలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

# గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా..

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిని పల్లి మండల పరిధిలోని కోదురు పాక గ్రామ ప్రజలు తనను ఆదరి ంచి సర్పంచిగా గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని మండల పరిధిలోని కోదురుపాక గ్రామ సర్పంచి అభ్యర్థిగా బోలుమాల లక్ష్మి శంకర్, నామినేషన్ దాఖలు చేశారు. కోదురుపాక గ్రామ పంచాయతీ దగ్గర నామినేషన్ దాఖలు చేసిన అనంతరం బోలుమల లక్ష్మి శంకర్, మాట్లాడుతూ గ్రామంలో సమస్యల పై గ్రామ శాఖ ఆధ్వర్యంలో కృత నిశ్చయంతో రాజీలేని అభివృద్ధి చేసి చూపిస్తానని కోదురుపాక గ్రామ ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆయనతో పాటు వార్డు నెంబర్లు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ యువత, తదితరులు పాల్గొన్నారు.

# మల్కెపల్లి ఏరియా వివాదంపై హైకోర్టు దృష్టి

**వేద న్యూస్, కాసిపేట:**



మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం లోని మల్కెపల్లి గ్రామ పంచాయతీ షెడ్యూల్ ఏరియా వివాదం మంగళవారం హైకోర్టులో మరోసారి విచారణకు వచ్చింది. ఈ కేసులో వాదనలు కొనసా గాయని, వచ్చే వారంలో తీర్పు వెలువడే అవకాశం ఉన్నట్లు కేసును వాదిస్తున్న హైకోర్టు న్యాయవాది వెంటేశ్వర్లు తెలిపారు.రెవెన్యూ రికార్డుల్లో నాన్ షెడ్యూల్ ఏరియాగా ఉంటేను, అధికారులు మల్కెపల్లిని షెడ్యూల్ ఏరియాగా కొనసాగించడం అన్యాయమని గ్రామానికి చెందిన కసాడి శ్రీనివాస్ సహా పలువురు గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. సరైన రికార్డులను పరిశీలించి మల్కెపల్లిని నాన్ షెడ్యూల్ ఏరియాగా ప్రకటించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు.కేసుపై వాదనలు పూర్తికావచ్చునని, త్వరలోనే న్యాయస్థానం తుది తీర్పు ఇవ్వనుందని గ్రామస్తులు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు.

# తనిఖీల్లో రూ.30,59,500 నగదు స్వాధీనం..!

**వేద న్యూస్, మెదక్:**



మక్కరాజీపేట్ జంక్షన్ వద్ద మంగళవారం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ ఎస్ టీ) తనిఖీల సందర్భంగా భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. దాచారం గ్రామం, గజ్వేల్ మండలానికి చెందిన దంపతులు గుండెల్లి సిరిష మరియు యాదగిరి ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా, వారి వద్ద ఉన్న సరైన పత్రాలు లేని రూ.30,59,500 నగదును పోలీసులు గుర్తించారు. నగదు గురించి స్పష్టమైన వివరణ ఇవ్వకపోవడంతో, ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేసి, స్వాధీనం చేసిన నగదును తదుపరి విచారణ కోసం సంబంధిత అధికారులకు అప్పగించారు. ఎన్నికల సమయంలో అక్రమ నగదు రవాణా, ఓటర్లను ప్రలోభపరచే ప్రయత్నాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన తనిఖీలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

# బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు

**వేద న్యూస్, గద్వాల్ :**



గద్వాల నియోజకవర్గం గద్వాల మండలం పూడూరు గ్రామానికి చెంది న కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచులు ,ఎంపీటీసీలు మరియు 50 మంది ముఖ్య నాయకులు బిఆర్ఎస్ పార్టీలో కి చేరారు. ఈ సందర్భంగా గద్వాల పట్టణంలోని బాసు హనుమంతు నాయుడు స్వగృహం నందు వారికి మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల హనుమంతు నాయుడు పార్టీ కండువా కప్పి,పార్టీలోకి ఆహ్వానించి,వారికి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూడూరు అంజి,చింతరేవుల లక్ష్మిరెడ్డి, ముని మౌర్య, అశోక్, తిమ్మప్ప, మనోహర్, ఆంజనేయులు,రవి,వీరేష్ మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

**వేద న్యూస్, మహబూబ్ నగర్ :**



మూసాపేట్ మండలం తునికినిపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ ముఖ్య నాయకులు నాగరాజు , పెద్ద ఎత్తున బిఆర్ఎస్ కార్యకర్తలు మరియు మూసాపేట్ మండల కేంద్రానికి చెందిన పలువురు మైనారిటీ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ( జిఎంఆర్) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073

## భోపాల్ విషవాయు విషాదం
## మానవ జాతి గుర్తుంచుకోవాల్సిన నల్లని రాత్రి

- లక్షల ఊపిరులను హరించిన నిర్లక్ష్యం
- పారిశ్రామిక దురాశకు బలైన సాధారణ జీవనం
- న్యాయం ఆరాటంగా మిగిలిపోయిన బాధితుల కథ
- పర్యావరణం ఇప్పటికీ నొప్పితో ఉన్న నేల

**వేద న్యూస్ డెస్క్:**

డిసెంబర్ నెలలోని ఆ చలిగాలుల రాత్రి, భోపాల్ అనే నగరం తన నిద్రలోనే మరణాన్ని ఎదుర్కొంది. ఒక పురుగుమందుల కర్మాగారం నుంచి బయటకు వచ్చిన విష వాయువు, పసి బిడ్డ నుంచి వృద్ధుని వరకు, జీవం ఉన్న ప్రతి ఒక్కరి ఊపిరిని బందీగా చేసింది. ఆ క్షణం తర్వాత ఏమి జరిగిందో దేశం తట్టుకోలేని భయంతో చూసింది. వీధులు శవాలతో నిండిపోయాయి, ఆసుపత్రులు కేకలతో నిండిపోయాయి, ఇళ్లలో దిక్కుతోచని ఆందోళన పరాచికంగా నిలిచింది.

ఈ విషాదం యాదృచ్ఛికం కాదు, అనర్థం కాదు, ప్రకృతి రౌద్రం కాదు. ఇది మానవ నిర్మిత విపత్తు. ధర తగ్గించాలని, సమయం ఆదా చేయాలని, లాభాల కోసం పరుగెత్తాలని చూసిన కంపెనీ, భద్రతా ప్రమాణాలను కాగితం మీదే ఉంచి, జీవితాల్ని అంచున నెట్టేసింది. "ఎన్ని ప్రమాదాలు వస్తాయిలే" అనే అహంకారం, మనుషుల జీవాన్ని తేలికగా చూసే దృక్కోణం, ప్రభుత్వాల పరిశీలనలోని లోపం ఇవే ఆ రాత్రి విష వాయువు కన్నా ఘోరమైనవి.

ఆ రాత్రి మరణించినవారు చూసిన బాధ ఒక రూపం. కాని బతికిపోయినవారు భరించిన బాధ, మనసు కూడా చెప్పుకోలేని గాయం. ఊపిరితిత్తుల్లో అగ్ని, కళ్లలో మండే నొప్పి, శరీరంలో అవరోధం ఇవి వాళ్ల జీవితాలను రాబోయే ఎన్నో సంవత్సరాల పాటు బంధించాయి. ప్రతి ఉదయం జీవించటానికి యుద్ధం, ప్రతి రాత్రి జీవించే భయం. ఒక సంఘటన, ఒక నగరం మాత్రమే కాదు, ఒక తరాన్ని బలితీసుకుంది. పర్యావరణం కూడా అదే విధంగా బాధను మోసుకుంటూ ఉంది. నేల విషపూరితమైంది, నీటి వనరులు కలుషితమయ్యాయి, చెట్లపై ప్రాణం తగ్గిపోయింది. భూమి పునరుద్ధరించుకోవడానికి నానాటికి ప్రయత్నిస్తున్నా, గాయం ఇంకా మానలేదు. పుట్టిన పిల్లల శరీరాల్లో కనిపించే లోపాలు, పాత గాయం ఇంకా నొప్పిగా నిలిచినట్లు కనిపిస్తున్నాయి.

బాధితులకు న్యాయం జరిగిందా? అనే ప్రశ్న అడగటం కన్నా, సమాధానం తెలిసిన బాధ మనసును పరచుకుంటుంది. నష్టపోయిన జీవితం విలువను కొలిచే పరిహారం ఎప్పటికీ రావడం లేదు. నేరానికి కారణమైన వారిలో చాలా మంది శిక్ష లేకుండానే కాలం గడిపేశారు. న్యాయం కోర్టుల్లో నడిచింది కానీ బాధితుల జీవితాల్లో నిలవలేదు. న్యాయం అనే పదం, ప్రాణం గల్లంతైన తర్వాత వచ్చిన చట్ట పత్రాలపై మాత్రమే కనిపించింది. ఈ విషాదం ఒక నిజాన్ని మనల్ని ఎదిరించింది. పారిశ్రామిక అభివృద్ధి అనే మాట, జీవం ఉన్న మనుషుల మీద అడుగుపెట్టి ముందుకు సాగితే, అది అభివృద్ధి కాదు, విధ్వంసం. కర్మాగారాలు కట్టడం కాదు. జీవితం రక్షించడమే అభివృద్ధి. లాభం సంపాదించడం కాదు సమాజం కోల్పోయే నష్టం అంచనా వేయడం అసలు బాధ్యత.

సాంప్రదాయంగా మన దేశంలో "పారిశ్రామిక భద్రత" అనే పదం ప్రసంగాల్లో బాగుంటుంది, కాగితం మీద మెరుస్తుంది. కానీ కార్మికుల చెమట, ప్రజల ఊపిరి, పర్యావరణం భద్రత కోసం నిర్మించాల్సిన వ్యవస్థ మాత్రం మరువబడుతుంది. భోపాల్ మనకు చెప్పిన దారుణమైన పాఠం మానవ జీవితం కన్నా విలువైన పరిశ్రమ లేదు. పర్యావరణం కన్నా గొప్ప అభివృద్ధి లేదు. పౌరుని భద్రత కన్నా పెద్ద ప్రగతి లేదు ఈ రోజును స్మరించడం అంటే కేవలం కన్నీటి జ్ఞాపకాలు కాదు. ప్రమాదం మళ్లీ జరగకుండా నిలుపుకోవడం. కంపెనీల దురాశను అడ్డుకోవడం. ప్రభుత్వ బాధ్యతను కట్టుబట్టించడం. ప్రజల జీవితం రక్షణను వ్యవస్థగా నిర్మించడం.భోపాల్ విషాదం మనకు గుర్తు చేసే అత్యంత ఘాటైన నిజం.. విష వాయువు ప్రాణాలు తీసింది, కానీ నిజంగా చంపినది నిర్లక్ష్యం, దురాశ, వ్యవస్థల వైఫల్యం.

## "వికలాంగత కాదు అవకాశాల సమాన హక్కు"

- శారీరక లోపం కాదు - సామాజిక అడ్డంకులే నిజమైన సమస్య
- చట్టాలు ఉన్నా అమలు లోపం కారణంగా జీవితాలు కష్టంలోనే
- విద్య, ఉపాధి, సాంకేతికత అందరికీ అందే విధంగా నిర్మాణం అవసరం
- కారుణ్యం కాదు - గౌరవం, స్వతంత్రత, సమాన హక్కుల పట్ల చైతన్యం

**వేద న్యూస్ డెస్క్:**

ప్రతి సంవత్సరం డిసెంబర్ 3ను "వికలాంగుల అంతర్జాతీయ దినోత్సవం"గా జరుపుకుంటున్నప్పటికీ, వికలాంగులు సమాజంలో నిజమైన భాగస్వాములయ్యారా అనే ప్రశ్నకు సమాధానం మాత్రం ఇంకా తేలలేదు. వికలాంగతను మన సమాజంలో వ్యక్తిగత లోపంగా చూడటం ఒక పెద్ద పొరపాటు. శారీరక లేదా మానసిక పరిమితులు కలిగిన వ్యక్తులను అడ్డుకునే వ్యవస్థలే అసలు వికలాంగతకు మూలం. వసతులు లేని పాఠశాలలు, కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలు, రవాణా మార్గాలు - ఇవన్నీ ఒక వ్యక్తి కాదు, సమాజపు లోపాలే.

భారతదేశంలో కోట్ల మంది వికలాంగులు ఉన్నారు. ఈ విభాగం చిన్నది కాదు, ఒక పెద్ద సామాజిక వర్గం. వీరి జీవితం గౌరవంతో సాగాలంటే, వీరిని ఇతరుల దయకు ప్రాతినిధ్యం చేసే విధంగా కాకుండా, స్వతంత్ర జీవనం గడపగల పౌరులుగా చూడాలి. మన రాజ్యాంగం అందరికీ న్యాయం, సమానత్వం హామీ ఇస్తే, వికలాంగులు కూడా ఆ హామీలో భాగం కావాలి.

కానీ వాస్తవ పరిస్థితి చూడాల్సి వస్తే, పాఠశాలలలో ప్రవేశం నిరాకరణ, ఉపాధి అవకాశాల్లో వివక్ష, ప్రయాణ సౌకర్యాల్లో అడ్డంకులు, పరీక్షల్లో సౌలభ్యం లేకపోవడం, ఆరోగ్య సేవల్లో అందుబాటు సమస్య ఇవన్నీ ఇప్పటికీ కొనసాగుతున్నాయి. చట్టాలు ప్రవేశపెట్టినా, అమలు లోపం కారణంగా చాలా మంది జీవితాలు అదృష్టం మీదే ఆధారపడుతున్నాయి.

విద్య విషయంలో వికలాంగుల పట్ల అసమానత స్పష్టంగా కనిపిస్తోంది. అనేక పాఠశాలలు వారికి అనుకూలమైన తరగతి గదులు కలిగివుండవు. ప్రత్యేక ఉపాధ్యాయులు లేకపోవడం, పాఠ్యాంశాలు అనుకూలంగా లేకపోవడం, పరీక్షల్లో సహాయాలు చేరకపోవడం వల్ల వేల మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేయాల్సి వస్తోంది. విద్య అందరికీ సమానంగా అందాలి అంటే, పాఠశాల నిర్మాణం మరియు బోధనా విధానం మారాలి.

ఉపాధిలో పరిస్థితి కూడా ఇదే స్థాయిలో ఉంది. నామమాత్రంగా కేటాయింపులు ఉన్నా, నియామకాల్లో వివక్ష అధికంగా కనిపిస్తోంది. కార్యాలయాల్లో సౌకర్యాలు లేకపోవడం, ప్రయాణ సౌకర్యం లేకపోవడం, వ్యక్తిని బలహీనుడిగానే చూడటం - ఇవన్నీ ఉద్యోగ జీవితాన్ని మరింత కఠినంగా మార్చుతున్నాయి. ఒక వికలాంగుడు పనికి అర్హుడు కాదని కాదుబీ కార్యాలయ నిర్మాణం, దృక్కోణం అతన్ని అడ్డుకుంటున్నాయి.భారతదేశంలో కోట్ల మంది వికలాంగులు ఉన్నారు. ఈ విభాగం .కానీ వాస్తవ పరిస్థితి చూడాల్సి వస్తే, పాఠశాలలలో ప్రవేశం నిరాకరణ, ఉపాధి అవకాశాల్లో వివక్ష, ప్రయాణ సౌకర్యాల్లో అడ్డంకులు, పరీక్షల్లో సౌలభ్యం లేకపోవడం, ఆరోగ్య సేవల్లో అందుబాటు సమస్య ఇవన్నీ ఇప్పటికీ కొనసాగుతున్నాయి. చట్టాలు ప్రవేశపెట్టినా, అమలు లోపం కారణంగా చాలా మంది జీవితాలు అదృష్టం మీదే ఆధారపడుతున్నాయి.నామమాత్రంగా కేటాయింపులు ఉన్నా, నియామకాల్లో వివక్ష అధికంగా కనిపిస్తోంది. కార్యాలయాల్లో సౌకర్యాలు లేకపోవడం, ప్రయాణ

సాంకేతికత సామాజిక మార్పుకు పెద్ద దారిని తెరిచే శక్తి కలిగివుంది. పఠన పరికరాలు, శబ్ద ఆధారిత సాధనాలు, ఇంటి నుంచే పని చేసే అవకాశాలు %-% ఇవన్నీ వికలాంగులకు గొప్ప మార్పును తీసుకురాగలవు. కానీ ఇవి పట్నాలలో, ధనిక వర్గంలో మాత్రమే నిలుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలు, పేద కుటుంబాలు ఇవి పొందలేకపోతే, సమానత్వం పేరుకే. సామాజిక దృక్కోణంలో కూడా పెద్ద పరివర్తన అవసరం. వికలాంగుడిని పాపం అనడం, జాలి చూపడం, దయ చూపడం - ఇవి మంచిదిగా అనిపించినా, నిజానికి అవమానమే. ఒక వ్యక్తి శారీరక పరిమితితో ఉంటే, అతని భావన, తెలివి, లక్ష్యం, జీవితం పరిమితం కావు. మానవ గౌరవం అంటే, స్వతంత్రత. సమాజం చూపించాల్సింది జాలి కాదుబీ గౌరవం. సమాన అవకాశాలు అందించడం పుణ్యం కాదుబీ ఇది రాజ్యాంగబద్ధమైన కర్తవ్యము. సమాన అవకాశాలు అందించే సమాజం నిర్మాణం కోసం మూడు ముఖ్యమైన దిశల్లో మార్పు అత్యవసరం:

# పిస్తోల్ కలకలం!?

- సులువుగా ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశ
- వ్యాపారికి బెదిరింపులు.. హత్య చేసేందుకు ప్లాన్
- ఎన్నికల తనిఖీలో నిందితుడి పట్టివేత
- ఒక పిస్తోల్ తపాంచ, రెండు మ్యాగ్జిన్లు స్వాధీనం
- జిల్లా ఎస్పీ నితిక పంత్ వివరాలు వెల్లడి






**వేద న్యూస్, ఆసిఫాబాద్ ప్రతినిధి:**

సులువుగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశ అతనికి ఓ సినిమా వల్ల కలిగింది.! వ్యాపారిని బెదిరించి.. హత్యకు ప్లాన్ చేసిన సదరు నిందితుడు.. హతమార్చేందుకు వెళ్తున్న క్రమంలో పోలీసులకు ఎన్నికల తనిఖీలో మంగళవారం పట్టుబడ్డాడు. కౌటాల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ నితిక పంత్ వివరాలను వెల్లడించారు. ఓ వ్యాపారిని పిస్తోల్‌తో కాల్చి చంపేందుకు వెళ్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

**ప్రాణహిత ఒడ్డున ప్రాక్టీస్!**

ఎస్పీ వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కౌటి- సాండ్గావ్ గ్రామానికి చెందిన కుర్బంకర్ అజయ్.. సులువుగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఓ హిందీ సినిమాతో ప్రేరణ పొందాడు. బాగా డబ్బున్న వారిని బెదిరించి.. భయపెట్టి అవసరమైతే హతమార్చి ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది జూన్ 11న రాత్రి సమయంలో బెదిరిస్తూ కౌటాలకు చెందిన ఓ వ్యాపారికి లేఖలు రాశాడు. రూ.50 లక్షలు ఇవ్వాలని, లేనిచో కుటుంబ సభ్యులను చంపుతామని రెండు లెటర్లు రాసి సదరు వ్యాపారి ఫెర్టిలైజర్ షాప్‌లో పెట్టాడు. వ్యాపారి స్పందించకపోవడంతో యూట్యూబ్‌లో చూసి పిస్టోలు తపంచా లాంటి మారణాయుధాలు బిహార్‌లో దొరుకుతాయని తెలుసుకున్నాడు. జూలై చివరి వారంలో అక్కడికి వెళ్లాడు. ఆగస్టు మొదటి వారం వరకు అక్కడే ఉండి బాబు సాహెబ్ కుమార్ అనే వ్యక్తి దగ్గర రూ. 55 వేలు చెల్లించి ఒక పిస్టోలు, రెండు మ్యాగజైన్లు దీనికి సంబంధించిన 20 బుల్లెట్లు, ఒక తపంచ, దీనికి సంబంధించిన ఒక బుల్లెట్ కొనుగోలు చేశాడు. అక్కడే షూటింగ్ నేర్చుకున్నాడు. మూడు బుల్లెట్లు అక్కడే ప్రాక్టీస్‌లో ఫైర్ చేసి.. ఖాళీ కోకలను తీసుకుని తన ఇంటికి వచ్చాడు. ప్రాణహిత నది ఒడ్డున ఒక బుల్లెట్ గాలిలోకి ఫైర్ చేసి ప్రాక్టీస్ చేశారు. సెప్టెంబర్ 26న కాగజ్‌నగర్ నుంచి మహారాష్ట్రకు వెళ్లే ట్రైన్ ఎక్కి అందులో ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ తీసుకొని.. డబ్బులు ఇవ్వాలని వ్యాపారికి ఫోన్ చేశాడు. లేకుంటే చంపేస్తామని బెదిరించాడు. అయినా సదరు వ్యాపారి స్పందించలేదు. దీంతో అక్టోబర్ 15న రాత్రి వేళలో వ్యాపారి తమ్ముడిని చంపాలని ఉద్దేశంతో పిస్తోల్‌లో రెండు బుల్లెట్లు నింపుకొని మార్గమధ్యలో వేచి చూసి..వ్యాపారి తమ్ముడు రాగానే అతని ముఖంపై లైట్ ఫోకస్ పెట్టి అతను అని గ్రహించి ఒక బుల్లెట్ ఫైర్ చేశాడు. ఆ గురి తప్పడంతో అక్కడి నుండి పారిపోయాడు. ఇదే క్రమంలో మంగళవారం ఉదయం సదరు వ్యాపారిని షాపులోనే హతమార్చాలనే ప్లాన్ చేశాడు. పిస్తోల్, మూడు బుల్లెట్ తీసుకుని బైక్‌పై వెళుతుండగా.. మార్గమధ్యలో ఎన్నికల తనిఖీ చేస్తున్న కౌటాల పోలీసులకు అనుమానం వచ్చి నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి ఒక పిస్తోల్, ఒక తపంచా (దేశి కట్ట), రెండు మ్యాగజిన్‌లతో పాటు 15 చిన్న బుల్లెట్‌లు, ఒక పెద్ద బుల్లెట్, ఐదు ఖాళీ కోకలు, సెల్ ఫోన్, ఒక బైకు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ వహీదుద్దీన్, కౌటాల సీఐ సంతోష్, ఎస్ఐ చంద్రశేఖర్, కాగజ్ నగర్ రూరల్ ఎస్ఐ సందీప్ తదితరులున్నారు.

# అసత్య ప్రచారం కాదు, వాస్తవాలు చూడండి

- కూటమి ప్రభుత్వం పింఛన్ల విస్తరణకు కట్టుబడి ఉందని నొక్కిచెప్పిన మంత్రి లోకేష్
- వైకాపా సోషల్ మాధ్యమాల్లో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నదని ఆరోపణ
- ప్రజలు వక్రీకరణను నమ్మే స్థితిలో లేరని వ్యాఖ్య




**అమరావతి, వేద న్యూస్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీపై వైకాపా చేస్తున్న ప్రకటనలు పూర్తిగా అబద్ధాలపై ఆధారపడి ఉన్నాయని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తీవ్రంగా మండిపడ్డారు. వైకాపా తన సోషల్ మాధ్యమాల ద్వారా, ప్రతి నెల వేల సంఖ్యలో పింఛన్ల కోతలు విధిస్తున్నామని, ప్రభుత్వం లబ్ధిదారులను నిర్లక్ష్యం చేస్తోందని విస్తృతంగా ప్రచారం చేస్తోంది. దీనిపై స్పందించిన లోకేష్, "జగన్ రెడ్డికి ఎప్పుడు కల వచ్చినదో కానీ, కోతల విషయంలో చేస్తున్న దుష్ప్రచారం వాస్తవానికి దూరమైనది" అని వ్యాఖ్యానించారు. లోకేష్ వివరించిన ప్రకారం, ప్రస్తుత నెలలో కొత్తగా వేల మందికి పింఛన్లు మంజూరు చేయబడినట్లు ప్రభుత్వం స్పష్టం చేసినా, వైకాపా మాత్రం ఈ సమాచారాన్ని పూర్తిగా విస్మరిస్తోందని చెప్పారు. "అర్హులైన వృద్ధులు, కార్మికులు, మహిళలు, వివిధ వర్గాలు వారికి సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. కానీ గతంలో వైకాపా హయాంలో ఒక నెల పింఛన్ తీసుకోకపోతే 'తూచ్ మేమే తింటాం' అనే ధిక్కారం చూపించారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పాలనలో సామాజిక భద్రతపై భారీ స్థాయిలో ఖర్చు చేసిన విషయాన్ని గుర్తుచేసిన లోకేష్, "కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, సామాజిక పింఛన్లు కేవలం ప్రకటనగా కాదు, ప్రజలకు నేరుగా ఆర్థిక భరోసాగా అందిస్తున్నాం. బాధ్యత, కట్టుబాటు, పారదర్శకత ఇవి మా వైఖరి" అన్నారు. సోషల్ మాధ్యమాల్లో వైకాపా చేస్తున్న దుష్ప్రచారంపై స్పందిస్తూ, "అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మీ ప్రభుత్వం చేసే పని. కానీ ప్రజలు ఇప్పుడు మోసపోవడం లేదు. వాస్తవాలు చూసే జాగృతి పెరిగింది. ప్రజాస్తానం ఇచ్చిన తేడా మీ తప్పులకు సమాధానం" అని వ్యాఖ్యానించారు. లోకేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిస్తూ, "సోషల్ మీడియాలో జరిగే అబద్ధాలను క్షేత్రస్థాయిలో ఖండించాలి. నిజమైన సమాచారం ప్రజలకు చేరాలి. ఈ ప్రభుత్వ నిర్ణయాలు ప్రచారం కోసం కాదు, ప్రజల జీవితాలను నిలబెట్టడానికి" అని తెలిపారు. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో, పింఛన్ల వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రచార యుద్ధాల సాధన కాకూడదని, అవి ప్రజలకు జీవన భరోసాను అందించే హక్కులుగా కొనసాగాలని లోకేష్ స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యానించిన తీరు, వైకాపా సోషల్ మాధ్యమాల్లో సాగిస్తున్న ప్రచారాన్ని ప్రతిస్పందనాత్మక దశలోకి నెట్టింది.

## ఆన్‌లైన్ మోసాలకు జాగ్రత్త - 'ఈజీ మనీ ఆఫర్లు' నమ్మవద్దని హెచ్చరిక

**వేద న్యూస్ డెస్క్:**

ఆన్‌లైన్‌లో "ఈజీ మనీ", "తక్షణ డబ్బు", "ఎక్స్‌క్లూజివ్ ఆఫర్" వంటి ప్రకటనల ద్వారా మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ పోలీస్ ప్రజలకు అప్రమత్తత అవసరమని హెచ్చరించింది. సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్స్, ఇ-మెయిల్ ద్వారా ఆకర్షణీయమైన ఆఫర్లను పంపిస్తూ, వ్యక్తిగత సమాచారం, డబ్బును దోచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. ప్రత్యక్షంగా మాట్లాడేందుకు ఉంటారని చెప్పి, 'ఫ్రీ గిఫ్టులు', 'భారి డిస్కౌంట్లు' వంటి పేర్లతో లింకులు పంపించడం సాధారణ పద్ధతిగా మారిందని పోలీసులు పేర్కొన్నారు. ఆ లింకులు క్లిక్ చేస్తే వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ సమాచారాన్ని దోచుకునే ప్రమాదం ఉందని హెచ్చరిక జారీ చేశారు. "తెలియని వ్యక్తులు పంపిన ఆఫర్లు, విన్నపాలు నమ్మెయొద్దు. అసలు లేవు అనుకునేంత మంచి ఆఫర్ల వెనుక మోసం తప్ప మరొకటి ఉండదు" అని సూచించారు. ఇంటర్నెట్‌లో సంపాదన అవకాశాలు, రివార్డులు, డిస్కౌంట్ కూపన్ల పేరుతో ఎవరైనా సంప్రదించినా, ఆ సమాచారాన్ని పంచుకోవద్దని, ఫోటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ, బ్యాంక్ వివరాలు ఇవ్వకూడదని పోలీసులు స్పష్టం చేశారు. ఆన్‌లైన్ స్కీంలు, కూపన్లు, లాటరీ మెసేజెస్ వల్ల ఎన్నో మంది ఇప్పటికే మోసపోయారని, ఇప్పుడు కొత్త పద్ధతులతో నేరగాళ్లు ప్రజల విశ్వాసాన్ని దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి సందేహాస్పద సందేశాలను వెంటనే బ్లాక్ చేయాలని, సైబర్ నేరాలపై అనుమానం వచ్చిన వెంటనే నమోదు చేయాలని పోలీసులు సూచించారు. "జాగ్రత్తగానే ఉండాలి. చిన్న క్లిక్ వల్ల పెద్ద నష్టం జరుగుతుంది. ఆఫర్లు, గిఫ్టులు, డిస్కౌంట్లు అన్నీ నిజం కావు" అని తెలిపారు. సాంకేతికత పెరిగిన కొద్దీ ఆన్‌లైన్ మోసాలకు కొత్త రూపాలు వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండటం మాత్రమే రక్షణ అని పోలీసులు అన్నారు.



వేద న్యూస్

బుధవారం డిసెంబర్ 03, 2025

# అఖిల్ లెనిన్ షూటింగ్‌లో మార్పులు ఫ్యాన్స్‌లో ఆందోళన



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ యువ హీరో అఖిల్ అక్కినేని ఎప్పటి నుంచో పెద్ద హిట్ కోసం ఎదురుచూస్తున్నాడు. తొలి చిత్రం నుంచి ఏజెంట్ వరకు ఆశించిన విజయాలు రాకపోవడంతో, ఈసారి లెనిన్ సినిమా తన కెరీర్‌ను మార్చే చిత్రమవుతుందన్న నమ్మకంతో అఖిల్ ముందుకు సాగుతున్నాడు. గ్రామీణ నేపథ్యంలో దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఇప్పటికే హీరోయిన్ విషయంలో మార్పు చోటుచేసుకుంది. మొదట శ్రీలీలను ఎంపిక చేసినా, షెడ్యూల్ సమస్యల వల్ల ఆమె స్థానంలో భాగ్యశ్రీ బోర్సేను తీసుకున్నారు. ఇదే సమయంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. కథలో మార్పులు చేయడంతో భారీగా షూట్ చేసిన ఇంటర్వెల్ ఎపిసోడ్‌ను పూర్తిగా రీషూట్ చేయాలని నిర్ణయించినట్టు యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నిర్ణయం షూటింగ్ షెడ్యూల్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. గత చిత్రం ఏజెంట్ భారీగా విఫలమైన నేపథ్యంలో అఖిల్ ఈసారి ఎలాంటి తప్పిదం జరగకుండా ప్రతీ సన్నివేశాన్ని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. వరుస మార్పులు, రీషూట్‌లు సినిమా మీద నెగటివ్ ప్రభావం చూపుతాయేమో అన్న సందేహాలు అభిమానుల్లో ఉన్నాయి. ఇదిలా ఉండగా, సినిమా టీమ్ ఎక్కువ కాలంగా ఎలాంటి అప్‌డేట్ ఇవ్వకపోవడంతో ఫ్యాన్స్ నిరుత్సాహంగా ఉన్నారు. అంతా లెనిన్ సినిమా విడుదలవ్వడాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం నిజంగా అఖిల్ కెరీర్‌కు తగిన మలుపు తీసుకువస్తుందా అన్నది చూడాల్సిన విషయమే.

# విడాకుల తర్వాత మళ్లీ పెళ్లి చేసిన టాలీవుడ్ జంటలు



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో ప్రేమ, వివాహం, విడాకులు, మళ్లీ ప్రేమ, మరోసారి వివాహంఇవన్నీ ఇప్పుడు అసాధారణం కాదని సెలబ్రిటీలు స్వయంగా నిరూపిస్తున్నారు. ఒకసారి ముగిసిన బంధం తర్వాత జీవితంలో కొత్త ఆరంభానికి ముందు వచ్చిన ప్రేమను స్వీకరించి, రెండో వివాహంతో జీవితాన్ని కొత్త దిశలో నడిపిన జంటలు ఇండస్ట్రీలో పెరుగుతున్నారు. కొందరు ప్రేమ వివాహంతో, మరికొందరు పెద్దల ఆమోదంతో పెళ్లి చేసుకుని.. వ్యక్తిగత కారణాలతో విడిపోయినా, తర్వాత మళ్లీ ప్రేమలో పడి కొత్త జీవితాన్ని మొదలుపెట్టారు. ఈ తరహా జీవిత ప్రయాణంలో ప్రముఖ నటులు, నటీమణులు కూడా ఉన్నారు. ఒక్కసారి ముగిసిన బంధం జీవితాన్ని నిలిపివేయదనే భావనతో, కొత్త ఆశలు, కొత్త అనుబంధాలతో మరో దశలోకి అడుగుపెట్టిన సెలబ్రిటీ జంటల కథలు అభిమానుల్లో ఆసక్తిని రేపుతున్నాయి. సామాజిక వేదికల్లోను ఈ జంటలపై చర్చలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రేమ, మనస్పర్థలు, ఒప్పందాలు, విభేదాలుఇవన్నీ జీవితంలో భాగమని, మళ్లీ ప్రేమను స్వీకరించడం జీవితానికి మరో అవకాశం ఇవ్వడమేనని చాలా మంది అంటున్నారు. టాలీవుడ్‌లో ఈ తరహా రెండో వివాహాలతో కొత్త అధ్యాయాలు ప్రారంభించిన జంటల్లో ప్రముఖులు కూడా ఉన్నారు. వ్యక్తిగత జీవితం ఎంతగా కష్టాలు ఎదురిచ్చినా.. తమ భావోద్వేగాలకు నిజాయితీగా, కొత్త బంధాలకు ఆత్మీయంగా ముందడుగు వేసిన సెలబ్రిటీలు ఇప్పుడు మరోసారి సంతోషాన్ని ఆస్వాదిస్తున్నారు. ఈ తరహా కొత్త సంబంధాల నేపథ్యంలో కుటుంబ సభ్యులు, అభిమానులు, సినీ వర్గాల ఆశీర్వాదాలతో ప్రారంభమైన కొత్త బంధాలు టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారాయి. ప్రేమకైనా, వివాహానికైనా ఒకే అవకాశం కాదుఅవసరమైతే మరోసారి హృదయం తెరచుకోవచ్చు అని ఈ జంటలు ఉదాహరణగా నిలుస్తున్నారు.

# మౌగ్లీ ట్రైలర్‌తో హంగామా.. కొత్త లుక్‌లో రోషన్ కనకాల




**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో యాంకర్ సుమ %-% రాజీవ్ కనకాల దంపతుల కుమారుడు రోషన్ కనకాల హీరోగా వస్తున్న 'మౌగ్లీ 2025' ట్రైలర్ విడుదలై మంచి హైప్‌ని క్రియేట్ చేసింది. సందీప్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ మూవీ డిసెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ట్రైలర్‌లో రోషన్ కొత్తగా, నేచరల్ బాడీ లాంగ్వేజ్‌తో కనిపించగా, కథాసరాంశం యువతను ఆకట్టుకునే అంశాలతో సాగుతుందనే సంకేతాలు అందించింది. హీరోయిన్‌గా సాక్షి సాగర్ మదోల్కర్ నటిస్తుండగా, వైవా హర్ష కీలక పాత్రలో కనిపించనున్నాడు. కాలా భైరవ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విజువల్స్‌కు మంచి ఎనర్జీని తీసుకొచ్చింది. రిలీజ్‌కు ముందు నుంచే యూత్‌లో క్రియేట్ అయిన ఆసక్తిని ఈ ట్రైలర్ ఇంకాస్త పెంచిందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రోషన్‌కి ఇదే సరైన బ్రేక్ అవుతుందా? బాక్సాఫీస్ వద్ద ఈ 'మౌగ్లీ' ఏ స్థాయిలో గర్జిస్తుందో చూడాల్సి ఉంది.


# మారుతి ఎలక్ట్రిక్ కారు విడుదల..




**వేద న్యూస్ డెస్క్:**

మారుతి సుజుకి ఎంతోకాలం తర్వాత ఎలక్ట్రిక్ వాహన రంగంలోకి అడుగుపెట్టింది. కంపెనీ తొలి సంపూర్ణ విద్యుత్ కారు ఈ -విటారాను విడుదల చేసింది. గుజరాత్‌లోని తయారీ కేంద్రంలో ఈ కారును ఉత్పత్తి చేస్తుండగా, ప్రస్తుతం విదేశీ మార్కెట్లకు పంపిస్తున్నారు. మన దేశంలో అమ్మకాలు, సరఫరాలు వచ్చే ఏడాది ప్రారంభం కానున్నాయి. ఈ-విటారాను మూడు రూపాలలో, పది రంగుల ఎంపికలతో అందించనున్నారు. వాహనానికి రెండు వేర్వేరు బ్యాటరీలు సిద్ధం చేశారు. ఒకటి తక్కువ సామర్థ్యంతో, మరొకటి ఎక్కువ సామర్థ్యంతో ఉంటుంది. పెద్ద సామర్థ్యమున్న బ్యాటరీ ఒకసారి పూర్తిగా నింపితే సుమారు ఐదు వందల కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదని సమాచారం. ఈ వాహనంలో ఆధునిక సౌకర్యాలు అందిస్తున్నారు. పెద్ద తెరతో కూడిన వినోద వ్యవస్థ, బుద్ధిమంతమైన భద్రతా సౌకర్యాలు, పూర్తిగా డిజిటల్ మీటర్ బోర్డు, చుట్టుపక్కల దృశ్యాన్ని చూపే ప్రత్యేక చూపు యంత్రం, విద్యుత్ ఆధారిత డ్రైవర్ సీటు, ముందు సీట్లకు గాలి సౌకర్యం, గాలికి సంబంధించిన పీడన సూచన, పెద్ద మేడకొండ దృశ్యపు గాజు వంటి అనేక సౌకర్యాలు ఇందులో లభిస్తాయి. ధర విషయానికొస్తే, ఈ%-%విటారా ఆరంభ ధర సుమారు పదిహేడు లక్షల రూపాయల వద్ద ఉండొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ధర పరిధిలో విడుదలైతే, దేశంలో ప్రస్తుతం ఉన్న అనేక విద్యుత్ కార్లతో ఇది పోటీ పడనుంది.

# ఇక దేశంలో నాలుగు పెద్ద బ్యాంకులు మాత్రమే




**వేద న్యూస్ డెస్క్:**

దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో భారీ మార్పులకు కేంద్ర ప్రభుత్వం మరో అడుగు వేయనుంది. ఐదేళ్ల క్రితం 27 ప్రభుత్వ రంగ బ్యాంకులను కలిపి 12గా మార్చిన కేంద్రం ఇప్పుడు మరోసారి విలీన ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధమవుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ, అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపడేలా బ్యాంకుల సంఖ్యను తగ్గించాలన్నదే కేంద్ర ఆలోచన. 2026 - 27 ఆర్థిక సంవత్సరంలోపే ఈ కీలక మార్పులు అమల్లోకి రానున్నట్లు ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ బ్యాంకులను పూర్తిగా పునర్వ్యవస్థీకరించి భవిష్యత్తులో కేవలం నాలుగు పెద్ద బ్యాంకులు మాత్రమే కొనసాగనున్నాయి. వీటిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా - యూనియన్ బ్యాంక్‌ల కలయికతో ఏర్పడే మరో కొత్త పెద్ద బ్యాంక్ ఉండనుంది. మొదట చిన్న బ్యాంకులను పెద్ద బ్యాంకుల్లో విలీనం చేసే ప్రక్రియ ప్రారంభించి, దశల వారీగా నాలుగు ప్రధాన బ్యాంకులుగా మార్చే దిశగా కేంద్రం చర్యలు చేపడుతోంది.

# వరల్డ్ క్రికెట్‌లో విషాదం

## హఠాత్తుగా కన్నుమూసిన ఇంగ్లండ్ దిగ్గజం రాబిన్ స్మిత్



**వేద న్యూస్ డెస్క్:**

ఇంగ్లండ్ మాజీ క్రికెట్ దిగ్గజం రాబిన్ స్మిత్ ఇకలేరు. ప్రపంచంలోని అత్యంత ఉగ్ర బౌలర్లను ధైర్యంగా ఎదుర్కొన్న ఈ క్రీడా మహోన్నతుడు డిసెంబరు 1న సౌత్ పెర్త్‌లోని తన ఇంట్లో హఠాత్తుగా ప్రాణాలు విడిచాడు. ఆయన వయసు 62 సంవత్సరాలు. రాబిన్ అంతకాల మరణ వార్తను కుటుంబ సభ్యులు అధికారికంగా వెల్లడించడంతో ప్రపంచ క్రికెట్ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. 'ది జడ్జ్'గా పేరొందిన రాబిన్ స్మిత్ మరణం ఇంగ్లండ్ క్రికెట్‌కు తీరని లోటుగా మారింది. "గుండెల నిండా బాధతో రాబిన్ ఇకలేరనే వార్తను మీతో పంచుకుంటున్నాం. ఇంట్లోనే హఠాత్తుగా మమ్మల్ని విడిచిపోయారు. మరణానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది" అని కుటుంబ సభ్యులు తెలిపారు. "ప్రపంచంలోని భయంకర వేగబంతులను ధైర్యంగా ఎదుర్కొన్న ఈ యోధుడు ఇకలేడనే విషయం ఇంగ్లండ్ క్రికెట్‌కు పెద్ద నష్టం" అని ఈసీబీ భావోద్వేగంతో ప్రకటించింది. డర్బన్ నుంచి హ్యాంప్‌షైర్ వరకు దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జన్మించిన రాబిన్ 1983లో ఇంగ్లండ్‌కు వలస వెళ్లాడు. అక్కడ హ్యాంప్‌షైర్ తరఫున ఆడి దేశవాళీ క్రికెట్‌లో తనదైన ముద్ర వేసి ఇంగ్లండ్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికాపై అరంగేట్రం చేసిన కొద్ది రోజుల్లోనే ఇంగ్లండ్ అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా ఎదిగాడు. 1988 నుంచి 1996 మధ్య 62 టెస్టులు, అలాగే వన్డేల్లోనూ రాణించిన రాబిన్ 1992 ప్రపంచ కప్ ఫైనల్ ఆడిన జట్టులో కీలక పాత్ర పోషించాడు. రిటైర్మెంట్ తర్వాత కష్టాలు 2004లో అన్ని రకాల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రాబిన్ తరువాత వ్యక్తిగత జీవితంలో ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. మద్యం వ్యసనం, మానసిక సమస్యలు అతడిని బాధించాయి. అయినప్పటికీ ఇటీవలి రోజుల్లో ఇంగ్లండ్ లయన్స్ జట్టు సభ్యులతో సరదాగా గడిపినట్లు సమాచారం. అలాంటి సమయంలో అకస్మాత్తుగా అతడు హఠాత్తుగా మరణించడంతో మిత్రులు, అభిమానులు షాక్‌కు గురయ్యారు. క్రికెట్‌కు సేవ చేసిన మహోన్నతుడిగా, ధైర్యవంతురాలైన బ్యాటింగ్‌కు ప్రతీకగా నిలిచిన రాబిన్ స్మిత్ మరణం ప్రపంచ క్రికెట్‌ను విషాదంలో ముంచెత్తింది.

# హార్దిక్ మెరుపుతో బరోడాకు ద్వితీయ విజయం



**వేద న్యూస్ డెస్క్:**

ఉప్పల్ స్టేడియం వేదికగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా జట్టు మరో ఘన విజయాన్ని నమోదు చేసింది. గాయం నుంచి కోలుకొని పునరాగమనం చేసిన హార్దిక్ పాండ్య అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శన బరోడా జట్టు విజయంలో ప్రధాన భూమిక పోషించింది. పంజాబ్‌తో జరిగిన పోరులో బరోడా ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో 8 వికెట్లకు 222 పరుగులు చేసింది. కెప్టెన్ అభిషేక్ శర్మ అర్ధశతకం (50) బాదగా, అన్మోల్ ప్రీత్ సింగ్ (69), నమన్ ధీర్ (39) కూడా రాణించారు. బరోడా బౌలర్లలో రాజ్ లింబానీ మూడు వికెట్లు తీసి ఆకట్టుకోగా, రసిఖ్ సలామ్, హార్దిక్ పాండ్య, అతిత్ షెత్ చెరో వికెట్ దక్కించుకున్నారు. భారీ లక్ష్య ఛేదనలో బరోడా బ్యాటర్లు ధైర్యంగా ఆడారు. ఓపెనర్లు విష్ణు సోలంకి (43), శాశ్వత్ రావత్ (31) మంచి ఆరంభం అందించారు. వన్‌డౌన్‌లో దిగిన శివాలిక్ వర్మ 47 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు బలం చేకూర్చాడు. తరువాత వచ్చిన హార్దిక్ పాండ్య 77 నాటౌట్ మెరుపు ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను బరోడా వైపు తిప్పేశాడు. 19.1 ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకుని బరోడా వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. బౌలింగ్‌లో వికెట్ తీసి, బ్యాటింగ్‌లో అజేయంగా నిలిచి జట్టును గెలిపించిన హార్దిక్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. ఆసియా కప్ సూపర్ -4లో శ్రీలంకతో పోరులో గాయపడ్డ అతడు ఇటీవల ఫిట్‌నెస్ సాధించి మళ్లీ మైదానంలోకి దిగి పాత ఫామ్‌ను గుర్తుచేశాడు. డిసెంబరు 9 నుంచి సౌతాఫ్రికాతో జరగనున్న టీ20 సిరీస్‌కు హార్దిక్ సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ ప్రదర్శన జట్టుకు మంచి సంకేతమైంది.

# జట్టులోకి తీసుకుని బెంచ్‌కి పరిమితం ఎందుకు?..

## - సెలక్టర్లపై అశ్విన్ గట్టిగా ప్రశ్న



**వేద న్యూస్ డెస్క్:**

సౌతాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో టీమిండియా విజయం సాధించి నప్పటికీ, జట్టు ఎంపిక పై కొత్త వివాదం చెలరేగింది. ముఖ్యంగా తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిని తుది జట్టులో ఆడించకపోవడ ంపై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. బెంచ్‌కే పరిమితం చేయాలనుకుంటే ఎందుకు ఎంపిక చేశారని సెలక్టర్లను నేరుగా ప్రశ్నించాడు. అశ్విన్ మాట్లాడుతూ, "హార్దిక్ లేని సందర్భంలో నితీశ్ కుమార్ రెడ్డికి తప్పకుండా అవకాశం ఇవ్వాలి. అతడు జట్టులో ఉన్నప్పటికీ బెంచ్‌కే పరిమితం చేశారంటే, సమస్య సెలక్షన్‌లోనే ఉంది. ఆడించే ఉద్దేశం లేనప్పుడు ఎందుకు సెలక్ట్ చేశారు? హార్దిక్ చేసే పని నితీశ్ కూడా చేయగలడు. అవకాశాలు ఇస్తే మరింత మెరుగుపడతాడు. కానీ ఇలాగే బెంచ్‌పైనే ఉంచుతుంటే, జట్టులోకి తీసుకోవడం మానేయండి" అంటూ సెలక్టర్లపై ఫైరయ్యాడు. ఆసియా కప్‌లో గాయపడిన హార్దిక్ పాండ్య తిరిగి పూర్తిగా కోలుకో కపోవడంతో, వన్డే సిరీస్ కోసం నితీశ్ కుమార్ రెడ్డిని సెలక్టర్లు ఎంపిక చేశారు. తొలి వన్డేలో అతడు ఆడతాడని అందరూ భావించినా, జట్టు నిర్వహణ స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను ముందు కు తెచ్చింది. కానీ సుందర్ ప్రదర్శన మాత్రం ఆశించిన స్థాయిలో రాలేదు. ఈ నేపథ్యంలో రెండో వన్డేలో అయినా నితీశ్‌కు అవకాశం ఇవ్వాలని మాజీ ఆటగాళ్లు, అభిమానులు పెద్ద ఎత్తున కోరుతున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073